# లోకనాథం... లో-బి.పి.

"డాక్టర్‌గారూ... గుండెల్లోకి సూదులు పొడుస్తున్నట్లు బాధ! ఒకటే చెమటలు, మంటలు, భరించలేని నీరసం, అస్సలు కుదురులేదండి! మీరు ప్రఖ్యాతి చెందిన గుండెవైద్య నిపుణులని వచ్చాను..."

- అంటూ గుండెలు చేత్తో పట్టుకుని కూర్చున్నాడు లోకనాథం. 'కావేరి హార్ట్ సెంటర్'లో స్పెషలిస్ట్ గుండూరావ్‌గారి ఎదురుగా కూర్చునివున్నాడు లోకనాథం.

లోకనాథం ఐదున్నర అడుగుల ఎత్తు ఉంటాడు. ఎప్పుడూ టకప్ చేస్తాడు. వినాయకుడి పొట్టకు నాగుపామును కట్టినట్లుగా తన బానపొట్టకు బెల్ట్‌తో ప్యాంట్‌కీ, షర్ట్‌కీ అనుసంధానం చేస్తాడు. కూర్చుంటే వినాయకుడే!

ఆయన వెంటనే లోకనాథాన్ని బి.పి. మిషన్‌తో పరీక్ష చేసి నొసలు చిట్లించారు.

లోకనాథానికి భయం వేసింది.

స్టెత్‌తో పరీక్ష చేసి, బాల్‌పెన్‌తో నుదురు మీద నాలుగుసార్లు కొట్టుకుని, ఒక అడుగు పొడుగు, ఆరంగుళాల వెడల్పు వున్న కాగితం మీద ఏదో బరబరా రాసేసి-

"ప్రక్క గదిలోకి వెళ్లండి. మీకు కొన్ని పరీక్షలు చేయాలి!" అని చెప్పి, "నెక్ట్స్..." అన్నారాయన.

అంటే... లోకనాథాన్ని తన గదిలోంచి బయటకు వెళ్లమని అర్థం!

ఆ పొడుగాటి కాగితం తీసుకుని లోకనాథం ప్రక్కగదిలోకి వెళ్లాడు. ఆ గదిలోకి ప్రవేశించగానే-

ఒక నర్స్ లోకనాథం మోచేయి పైభాగాన్న ఒక రబ్బరు బ్యాండేజ్ బిగించి, చేయి ముడుచుకునే చోట నరంలోంచి ఒక సిరంజి నిండా రక్తం తీసింది.

ఇంకో నర్స్ వచ్చి అతని చేతికి ఒక చిన్నసీసా ఇచ్చి "లోపల బాత్‌రూమ్‌లోకి వెళ్లి యూరిన్ పట్టి తీసుకురండి!" అంది.

గుండెల్లో నెప్పికీ, యూరిన్‌కీ సంబంధం ఏమిటో లోకనాథానికి అర్థంకాలేదు. అయినా ఆమె చెప్పినట్లు చేశాడు.

ఈలోగా ఇద్దరు 'మగ నర్సులు' వచ్చి "లోపలకి పదండి సార్!" అన్నారు.

లోకనాథం మరో గదిలోకి వెళ్లాడు.

అక్కడ ఒక మంచం వుంది. ఆ మంచంమీద చొక్కా విప్పేసి పడుకోమన్నారు.

గుండెలకు రెండువైపులా, మణికట్లు మీద, ఇంకా కొన్నిచోట్ల ఏదో లిక్విడ్ వ్రాసి వైర్లు అతికించి మిషన్ ఆన్ చేశారు. మిషన్‌లోంచి కాగితం రిబ్బన్ వస్తోంది.

"ఇది ఇ.సి.జీ అండీ! మీ గుండె యొక్క పనిచేసే విధానం ఎలావుందో తెలుపుతుంది!" అన్నాడు ఆ మిషన్ దగ్గర ఉన్న వ్యక్తి.

లోకనాథం మంచం మీద నుండి లేచాడో, లేదో- ఇంకో వ్యక్తి "ఇటు రండి!" అని బెడ్ ప్రక్కన వున్న ఒక మిషన్ మీద ఎక్కమన్నాడు.

"ఇది ట్రెడ్ మిత్ సర్! ఇది మీరు తొక్కితే మీ గుండె ఎలా స్పందిస్తుందో చూసి దాన్నిబట్టి మీ గుండెజబ్బు నిర్ణయం చేస్తాం. ఈ మిషన్ మీరు అస్సలు తొక్కలేకపోయారనుకోండి... వెంటనే మీకు ఓపెన్ హార్ట్ సర్జరీ చేయాల్సివుంటుంది!" అన్నాడతను.

లోకనాథం గుండె గుభేల్‌మంది!

అయినా... భయంభయంగా మిషన్ ఎక్కాడు. కాని, తను ఎక్కి దిగాక ఒళ్ళంతా చెమటతో బనీను, చొక్కా తడిసిపోయాయి. చచ్చే దాహంగా ఉంది. 'మాయదారి మనుషులు- మంచినీళ్లు కూడా ఇవ్వకుండా నన్ను చిత్రహింసల పాలు చేస్తున్నారు' అనుకున్నాడు లోకనాథం.

పరీక్షలన్నీ అయిపోయాయి... ఇంకో పరీక్ష ఉంది!

"పదండి..." అంటూ అతన్ని మరో గదిలోకి తీసుకువెళ్లి చొక్కా విప్పేయమని ఎక్స్-రే తీశారు.

'ఏమిటో... ఈ అర్థంలేని పరీక్షలు!' అనుకున్నాడు లోకనాథం. డాక్టర్ దగ్గరకు వచ్చాక 'ఈ టెస్ట్‌లన్నీ ఎందుకండీ..?' అని అడగడానికి వీలులేదు కదా! 'డాక్టర్ని నేనా? నువ్వా?' అని అడిగాడనుకో... అసలే గుండెలతో పని!' అంటూ లోకనాథం ఆలోచిస్తుంటే...

"ఇంకో గంటలో మీ టెస్ట్ రిజల్స్ అన్నీ వస్తాయి. మీరు క్లినిక్‌లో డాక్టర్‌గారి దగ్గరకు వెళ్లండి!" అన్నాడు.

"మీ పేరు లోకనాథం కదూ?" అంటూ నర్స్ ఎదురైంది. టక్కుటమారంతో నర్స్ మాంచి స్టైల్‌గా ఉంది.

"అవును..."

"మీరు ఈ మాత్ర నాలిక క్రింద పెట్టుకుని ఒక గంట ఆ బల్లమీద పడుకోండి. మాత్ర కరిగిపోతుంది. ఆ టైముకు నేను వచ్చి పిలుస్తాను. అప్పటివరకూ లేవకండి!" అంటూ హై హీల్స్ టకటకలాడించుకుంటూ వంకరటింకరగా, వయ్యారంగా నడుస్తూ వెళ్లింది నర్సమ్మ.

ఆమె నడక హొయలు చూస్తుంటే... నార్మల్ బిపీ కాస్తా హై బీపీ అయ్యే ప్రమాదం వుందనిపించింది లోకనాథానికి.

'కావేరి హార్ట్ సెంటర్ చాలా ప్రసిద్ధి' అనీ, అక్కడికి వెళ్లమని తన ఆఫీసులో చెప్తే వచ్చాడు. ఏమిటో... ఇన్ని పరీక్షలు చేశారు. 'ఆరోగ్యమే మహాభాగ్యం' అన్నారు. అంతేకదా... తను ఆరోగ్యంగా వుంటే డబ్బు ఖర్చు కాదుకదా!

ఇప్పుడు పరీక్షలకీ, డాక్టర్ ఫీజుకీ ఎంతవుతుందో, ఏంటో..?!' అనుకుంటూ నర్సు ఇచ్చిన మాత్ర నాలిక క్రింద పెట్టుకుని పడుకున్నాడు బల్లమీద. 'వచ్చేటప్పుడు కనీసం తన భార్యనైనా తీసుకురావాల్సింది!' అనుకున్నాడు.

కొంచెంసేపు గడిచింది!

లోకనాథం కళ్ళు తెరిచాడు. కళ్ళు బైర్లు కమ్మిపోతున్నాయి. తనకు ఏం జరుగుతుందో అర్ధంకావడం లేదు. లేస్తే క్రింద పడిపోయేట్లు వుంది తన పరిస్థితి!

ఇంతలో...

నర్సమ్మ వచ్చింది!

"అదేంటండీ... లేచారు? నేను వస్తానని చెప్పాను కదా... పడుకోండి!" అంటూ కసిరింది- పెళ్ళాం కసిరినట్లు.

అంతే... లోకనాథం కిమ్మనకుండా పడుకుండిపోయాడు.

ఒక అర్ధగంటలో లోకనాథం నాలిక క్రింద మాత్ర కరిగిపోయింది.

లోకనాథం లేవబోతున్నాడు...

ఈలోగా డాక్టర్ గుండూరావ్‌గారు వచ్చారు.

"మిస్టర్ లోకనాథంగారు! మీకు అన్ని పరీక్షలు చేయించాను. 'టు బి ఆన్ సేఫ్ సైడ్' మీకు బి.పి. నార్మల్‌గా వుంది. రక్తపరీక్ష వో.కె.! మూత్రంలో ఏమీ లేదు, ఇ.సి.జి.లో ఫాల్ట్ లేదు, ట్రెడ్ మిల్ పెర్ఫామెన్స్ ఫైన్, ఎక్సరే నో రిమార్క్! చాలా అదృష్టవంతులు! అయితే వీటన్నింటిని బట్టి నేను ఇన్వెస్టిగేట్ చేసిందేమిటంటే... మీకు 'లో- బి.పి' డెవలప్ అవుతోందని! మీరు నాలిక క్రింద మాత్ర పెట్టుకున్నారు చూడండి... అప్పుడు మీకు కళ్ళు తిరిగినట్లు ఉండకూడదు. నార్మల్‌గా వుండాలి. దాని అర్ధం ఏమిటంటే... మీ హార్ట్ మీద సమ్ ప్రెషర్ వుందని! అందువలన మందులు వ్రాస్తున్నాను. రెగ్యులర్‌గా వాడండి. ముఖ్యంగా... ఈ మందులు వాడినన్నాళ్లు బెడ్ రెస్ట్ చాలా అవసరం. అంతే... మీరు నార్మల్‌గా అయిపోతారు. రండి!" అంటూ ఆయన సీటు దగ్గరకు వెళ్లారాయన.

ఆయన వెనకాలే వెళ్లి ఆయనకు ఎదురుగా కూర్చున్నాడు లోకనాథం.

ఆయన మళ్లీ పొడుగాటి కాగితం తీసుకొని- పన్నెండు రకాల మందులు, టానిక్కులు వగైరాలు వ్రాసి ఇచ్చారు.

"ఇవిగో... ఈ మందులు ఎలా వాడాలో నర్స్ చెప్తుంది. మందులు వాడటమే కాకుండా మీరు కనీసం ఒక నెలరోజులు శెలవు పెట్టి బెడ్‌రెస్ట్ తీసుకోండి!" అన్నారు డాక్టర్.

'బ్రతుకు జీవుడా...' అనుకుంటూ బయటకు వస్తూ లోకనాథం హాస్పిటల్ కౌంటర్ దగ్గరికి చేరాడు.

వాళ్ళు ఒక మంచి దళసరి అట్టఫైలు ఒకటి చేతిలో పెట్టి, డాక్టర్ ఫీజు, మందులు, టెస్ట్‌లకు కలిపి నాలుగు వేలు కట్టమన్నారు.

మారుమాట్లాడకుండా డబ్బు కట్టి అక్కడ్నుంచి బయటపడ్డాడు.

●

లోకనాథం ఉస్సూరుమంటూ ఇంటికి వచ్చాడు.

ఇంటికి చేరగానే భార్య హార్లిక్స్ కలిపిచ్చింది.

"డాక్టర్‌గారు ఏమన్నారండీ..."

"లో-బి.పి' అని అనుమానంగా వుందని- నెలరోజులు శెలవు పెట్టి రెస్ట్ తీసుకోమన్నారు. మందులు వ్రాశారు!" అన్నాడు.

"అక్కడికీ నేను చెబుతూనే వున్నాను... మీరు ఎక్కువగా మాట్లడవద్దని! సొల్లు వాగుడు ఎక్కువ! ఎవరైనా వస్తే చాలు... సుత్తేస్తారు! వాళ్ళని మాట్లడనియ్యకుండా ఒకటే బాదుడు! అదిసరే... డాక్టర్‌ని మాట్లాడనిచ్చారా, లేదా? అందుకే మీకు 'లో-బి.పి.' వచ్చింది!" అంటూ నస మొదలుపెట్టింది.

'హాస్పిటల్‌లో కళ్ళుతిరిగి గాబరా పడిపోయాడు. మరోప్రక్కన నాలుగువేలు ఖర్చయిపోయింది. దోపిడీ అయిపోయింది! అని తను బాధపడిపోతుంటే... ఇదెక్కడి గోల?' అనుకున్నాడు లోకనాథం.

ఇంతలో...

ఇంటి ప్రక్కనాయన వచ్చాడు- "ఏమయిందండీ లోకనాథంగారు... వంట్లో బాగాలేదా?" అంటూ!

ఆయన రోజూ ఉదయాన్నే తనకు పడేసిన పేపరు తెల్లవారుజామున లేచి తనకన్నా ముందే చదివేసి గుట్టుచప్పుడు కాకుండా మడతపెట్టి గేటుకు తగిలిస్తాడు.

"అవునండీ! డాక్టరు దగ్గరకు వెళ్లాను... అన్ని పరీక్షలు చేశారు. 'లో-బి.పి.' అని చెప్పారు. నెలరోజులు శెలవు పెట్టి బెడ్‌రెస్ట్ తీసుకోమన్నారు. అసలు 'లో-బి.పి.' ఎందుకు వస్తుందంటారు?" అన్నాడు లోకనాథం.

"నాకైతే తెలియదండీ! మా బావమరిదికి 'లో-బి.పి.' వచ్చిందోసారి... కనుక్కుందాం!" అంటూ ఫోన్ దగ్గరకు వెళ్లబోయాడు.

"మీ బావమరిది ఉండేది ఎక్కడ?"

"న్యూఢిల్లీలో ఉంటున్నాడు. అడుగుదాం... ఉండండి!" అంటున్న ఆయనకు అడ్డువచ్చి, "ఫోన్ డెడ్ అయ్యిందండీ అన్నయ్యగారూ!" అంది లోకనాథం భార్య.

ఇలాగ సాయంత్రానికి నలుగురైదుగురు వచ్చి లోకనాథాన్ని పరామర్శించడం, సలహాలు ఇవ్వడం జరుగుతూనే ఉంది.

అతని శ్రీమతి ఒకసారి లోపల్నుండి వచ్చి-

"అబ్బ... వచ్చినవాళ్ళందరికీ రోగాల గురించి ఏకరువు పెట్టకండి. మీ రోగం ఎక్కువైపోతుంది. దాంతోపాటు నాక్కూడా ఏదో ఒక రోగం వచ్చేట్లుగా ఉంది!" అంది విసురుగా.

"కాదే పిచ్చిముఖమా! 'రోగం రొస్టు- సంసారం గుట్టు' అన్నారు. ఎందుకో తెలుసా! రోగం పదిమందికి చెప్పుకుంటే పది రకాల వైద్యాలు చెబుతారు. అప్పుడు ఏదో ఒక వైద్యంతో రోగం నయమైపోతుంది. అదే దాచుకున్నామనుకో... ఎంత నష్టమో తెలుసా?" అన్నాడు లోకనాథం.

'ఈ జన్మలో ఈ మనిషిని నేను మార్చలేను... నా కంఠశోష తప్పు!' అనుకుంది ఆమె.

•

మర్నాడు లోకనాథం సన్నిహిత మిత్రుడు వచ్చాడు.

"అదేమిటో లోకనాథం! గుండ్రాయిలా ఉండేవాడివి... ఇంగువ కొట్టే చిన్నరాయిలా అయిపోయావు!" అన్నాడు.

అసలైతే లోకనాథానికి కొంచెం నీరసంగా ఉంది. కాని, ఈ మాటలు వినేసరికి నిస్త్రాణ ఆవహించేసి మాటలు తడబడ్డాయి.

"లో-బి.పి' అన్నాడు డాక్టర్!" అన్నాడు ఎలాగో.

"చాల్లేగానీ... నువ్వు ఈ ఇంగ్లీష్ మందులు వాడద్దు. మా పిన్నికొడుకు హోమియో వైద్యం చేస్తాడు. వాడు ఎన్నో క్రానిక్ కేసులు డీల్ చేశాడోయ్... నీదెంత? నీకు పదిహేను రోజుల్లో నయం కాకపోతే నా చెవి కోసుకుంటా!" అన్నాడు.

"నీ చెవి ఇన్స్యూర్ చేయించావా?" అని అడగబోయి-

'ఇప్పటికే వెయ్యి రూపాయల మందులు కొనేశాను... ఏం చేయాలి?' అని లోకనాథం అనుకుంటుంటే-

"నువ్వు ఇంగ్లీష్ మందులు, హోమియోమందులు కలిపి వాడవచ్చు. దేని దారి దానిదే!" అన్నాడతను. అంతటితో ఊరుకోకుండా అతని పిన్నికొడుకు దగ్గర నుండి నాలుగు సీసాల మాత్రలు తెప్పించి పంపించేశాడు.

ఇదిలా ఉండగా... లోకనాథం చిన్ననాటి మిత్రుడు అనుకోకుండా వచ్చాడు. లోకనాథాన్ని చూసి విషయం తెలుసుకుని-

"అయ్యో బ్రదర్! చాలా చెడ్డపని చేశావ్. మా బాబాయ్ చింతలపూడిలో 'చిట్టెన్న' అనీ ఆయుర్వేదంలో ఘనాపాఠి! చరకుడి ఆయుర్వేద శాస్త్రం ఔపాసన పట్టాడనుకో! అందుకుని వెంటనే బయలుదేరు. నేను తీసుకువెళ్లి స్వయంగా వైద్యం చేయిస్తా!" అంటూ లోకనాథాన్ని బయలుదేరదీసి చింతలపూడిలో మందులు ఇప్పించాడు.

ఇక, మర్నాటి నుంచి లోకనాథం-

'లో-బి.పి.' తగ్గడం కోసం ఉదయం నుండి రాత్రి పడుకునేవరకూ ఇంగ్లీష్, హోమియోపతి, ఆయుర్వేదం మందుల్ని- తన శరీరంలో రైళ్లు గుద్దుకున్నట్లుగా ఒకదానికొకటి క్లాష్ కాకుండా సమయం సర్దుబాటు చేసుకుని మింగుతున్నాడు.

అతని బల్లమీద ఈ మూడు రకాల మందులు చూసి అతని భార్య ఈ మందులన్నీ తన భర్త కడుపులో కలిసి కెమికల్ రియాక్షన్ అయిపోయి, అతని కడుపు కాస్తా పేలిపోతుందేమోనని భయపడసాగింది.

ఆ విషయం లోకనాథానికి చెప్తే-

"ఏ పుట్టలో ఏ పాముందో..?! ఏదో ఒక మందు పనిచేయకపోతుందా?" అన్నాడు.

ఇంక తనేం చేయగలదు?

"సాగితే రోగం అంత సుఖం లేదన్నట్లుగా' లోకనాథం హాయిగా తన పడక గదిలో ఎప్పుడూ కాలక్షేపం చేస్తున్నాడు... శేషశయనుని ఫోజులో.

●

ఒకరోజు అర్ధరాత్రి లేచి గ్లాసునిండా ఉప్పు కలుపుకుని నీళ్లు తాగుతున్న లోకనాథాన్ని చూసిన అతని భార్య-

"మళ్లీ ఇదేమిటండీ..?" అని అడిగింది.

తన ఆఫీసులో ఎవరో చెప్పారుట- ఉప్పునీళ్లు రోజూ త్రాగితే 'లో-బి.పి.' తగ్గుతుందని!

ఇలాగ లోకనాథం తన శరీరంలోకి మందుల్ని సరఫరా చేస్తుండగా... 'మూలిగే నక్క మీద తాటిటెంక పడినట్లు' ఢిల్లీ నుండి 'ఎ.ఐ.ఐ.ఎం.ఎస్.'లో మెడికల్ ఆఫీసర్‌గా పనిచేస్తున్న తన బావమరిది వచ్చాడు పనిమీద.

అతను వస్తూనే... తన బావగారి 'ఔషధ సేవనా వినోదం' చూసి చాలా కంగారుపడిపోయాడు. అయినా 'పెరటిచెట్టు వైద్యానికి పనికి రాదన్నట్లు' తను చెప్పడం కన్నా- 'అతను అడిగితే చూద్దాం!' అని ఊరుకున్నాడు.

ఇంతలో...

లోకనాథం భార్య ముక్కు చీదుకుంటూ- "నా పసుపుకుంకుమలు నిలబెట్టు అన్నయ్యా! ఈయన సిమెంట్ ఫ్యాక్టరీలో మూడు షిఫ్టులు కార్మికులు పనిచేసినట్లు- ఆయన శరీరాన్ని విశ్రాంతి ఇవ్వకుండా మొత్తం దేశంలో ఉన్న మందులన్నీ ఉదయం నుండి రాత్రి వరకు శరీరంలో పోసేస్తున్నారు. ఏమైపోతారో తెలియడంలా!" అంటూ శోకాలు పెట్టింది.

ఆయన వెంటనే తన బావగార్కి అన్ని పరీక్షలూ చేసి, ఆయన హార్ట్ సెంటర్ నుండి తెచ్చిన ఫైలు పరిశీలన చేసి, పకాపకా నవ్వి, "బావగారూ! ఎవడండీ మీకు 'లో-బి.పి.' అని చెప్పింది? బుద్ధి లేకపోతే సరి! మీకు గ్యాస్ట్రబుల్ ఉంది. దానివలన కడుపులో పేరుకున్న గ్యాస్ ఎగదన్ని మీకు గుండెల మీద ఒత్తిడి వలన మీకు గుండె వున్న ప్రాంతంలో నెప్పి వస్తోంది. కడుపులో గ్యాస్ ఉత్పత్తి అవకుండా, గ్యాస్ ఉత్పత్తి చేసే పదార్థాలు తినకుండా ఉండండి. ఈ మందులన్నీ పారేయండి!" అని తేల్చేశారు.

అప్పుడే లోకనాథానికి తన జబ్బు తగ్గిపోయినట్లు అనిపించింది. లోకనాథం తన బావగారి సలహా పాటించడం మొదలుపెట్టాడు వెంటనే.

లోకనాథం భార్య తన స్నేహితులతో "ఢిల్లీ నుండి మా అన్నయ్య రాబట్టి సరిపోయింది గాని- లేకపోతే ఈయన వేసుకునే మందులతో మానవ బాంబులాగా పేలిపోయేవారే! నా తాడు కాస్తా తెగేదే!!" అంటూ ఉంటుంది.

●

'వార్తాసాగరం' దినపత్రిక ... 16 మార్చి' నుండి 18 మార్చి' 2004 సంచికలలో ప్రచురితం